సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

మంగళవారం । 8 । అక్టోబర్ । 2024



ఉపాధి కోసం వస్తే.. ఊపిరి ఆగింది

సంబేపల్లె మండలం ఎస్.సోమవరం గ్రామంలో పిడుగుపాటుకు ఇద్దరు మహిళా కూలీలు మృత్యువాత పడ్డారు. మరో ఏడుగురు అపస్మారక స్థితిలో ఉన్నారు. - 10లో

ఆంధ్రా రంజీ జట్టుకు రఫీ



కడప నగరానికి చెందిన ఎస్. మహమ్మద్ రఫీకి ఆంధ్రా రంజీ జట్టుకు ప్రాతినిధ్యం వహించే అరుదైన అవకాశం లభించింది. రఫీ ఆల్‌రౌండర్ కావడంతో సెలెక్టర్లు ఎంపిక చేశారు. - 10లో

గరిష్టం/కనిష్టం 33.8 /25.3

వాతావరణం

జిల్లాలో సోమవారం 25.3 - 33.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

వైవీయూ బీటెక్ పరీక్షా ఫలితాలు విడుదల

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రొద్దుటూరు వైయస్సార్ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ 2,4వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల అయ్యాయి. ఫలితాలను వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి.. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జయరామి రెడ్డితో కలిసి విడుదల చేశారు.

'టెట్'కు 199 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా సోమవారం నిర్వహించిన ఏపీ టెట్ పరీక్షకు 199 మంది గైర్హాజరైనట్లు డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 8 పరీక్షా కేంద్రాలలో ఉదయం, సాయంత్రం రెండు సెషన్స్ కలిపి 1835 మంది అభ్యర్థులకుగాను 199 మంది గైర్హాజరయ్యారని ఆమె తెలిపారు. జిల్లావ్యాప్తంగా పరీక్ష నిర్వహణకు సంబంధించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగాయని డీఈఓ తెలిపారు.

ఆర్ట్స్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. బీఏ స్పెషల్ తెలుగు, హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, స్పెషల్ ఉర్దూ, బీకాం జనరల్, బీబీఏ, కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ, మ్యాథమ్యాటిక్స్, జియాలజీ, బయోటెక్నాలజీ, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆయా విభాగాల ఇన్‌చార్జిలను నేరుగా సంప్రదించి ప్రవేశాలు పొందాలని సూచించారు. ఈ ప్రవేశాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండదని తెలిపారు.

ఫిర్యాదులకు సత్వర పరిష్కారం



ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజల నుంచి ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీస్ అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీస్‌స్టేషన్‌లలో, సర్కిల్ కార్యాలయాలు, సబ్‌డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

ఖబడ్దార్!







- మద్యం షాపులకు దరఖాస్తు చేసే వారికి వార్నింగ్ ఇస్తున్న 'పచ్చ నేతలు'
- దరఖాస్తు చేయడానికి భయపడుతున్న వ్యాపారులు
- కడపలో హెచ్చరికలు చేస్తున్న 'ఆ నలుగురు'
- నిరభ్యంతరంగా దరఖాస్తు చేసుకోవాలని కోరుతున్న ఎక్సైజ్‌శాఖ

సాక్షి ప్రతినిధి, కడప : ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకొచ్చింది. దరఖాస్తులతోనే గణనీయ ఆదాయం గడించాలనే ఎత్తుగడ ఎంచుకుంది. అదే అధికారాన్ని అడ్డుపెట్టుకొని టీడీపీ నేతలు ప్రభుత్వ అంచనాలనే తారుమారు చేస్తున్నారు. మద్యం వ్యాపారులపై బెదిరింపులకు దిగుతున్నారు. లాటరీలో మద్యం షాపు దక్కినా, నిర్వహణ సాధ్యం కాదనే సంకేతాన్ని ఇస్తున్నారు. ఫలితంగా దరఖాస్తులు చేయాలనుకునే వారు ఎందుకొచ్చిన గొడవ అన్నట్లు మిన్నకుండి పోతున్నారు. సిండి'కేటుగాళ్ల'కారణంగా దరఖాస్తుల స్వీకరణ అంచనాలు తారుమారయ్యాయి.

వైఎస్సార్ జిల్లాలో 139, అన్నమయ్య జిల్లాలో 111మద్యం షాపులకు నోటిఫికేషన్ విడుదలయ్యింది. దరఖాస్తు స్వీకరణకు అక్టోబర్ 9వతేది సాయంత్రం 5గంటల వరకూ తుది గడువు విధించారు. సోమవారం సాయంత్రం 5గంటల వరకూ వైఎస్సార్ జిల్లాలో 789 దరఖాస్తులు, అన్నమయ్య జిల్లాలో దాదాపు 600 దరఖాస్తులు లభించాయి. ఒక్కో మద్యం షాపునకు సరాసరిగా 30 దరఖాస్తులకు తక్కువ లేకుండా లభిస్తాయని ప్రభుత్వం అంచనా వేసింది. కనీసం సరాసరిగా 20 దరఖాస్తులకు తక్కువ కాకుండా వస్తాయని ఎక్సైజ్‌శాఖ అధికారులు అంచనా వేశారు. రెండు జిల్లాలో 250 మద్యం షాపులకు కనీసమన్నా 5వేలు దరఖాస్తులు లభిస్తాయని, తద్వారా దరఖాస్తు ఫీజు రూపేనా రూ.100కోట్లు లభిస్తోందని అంచనాలో ఉన్నట్లు తెలుస్తోంది. దరఖాస్తుకు ఇక రెండు రోజులే గడువు ఉంది. ఇప్పటి వరకూ 14వందలకు మించి దరఖాస్తులు లభించలేదు. కాగా, ప్రభుత్వ అంచనాలను తెలుగుతమ్ముళ్లే తూట్లు పొడుస్తున్నారు. అదే విషయాన్ని ఎక్సైజ్‌శాఖ అధికారులు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

కడపలో చక్రం తిప్పుతున్న ఆ నలుగురు...

కడప కార్పొరేషన్ పరిధిలో 21 మద్యం షాపులకు టెండర్లు ఆహ్వానించారు. కాగా, జిల్లా కేంద్రమైన కడపలో టీడీపీ నేతలకే మద్యం షాపులు దక్కాలనే దిశగా ఆ నలుగురు అడుగులు వేస్తున్నారు. ఈక్రమంలో తెరముందుకు పాతకడప మాజీ సర్పంచ్, చిన్నచౌక్ ప్రాంతానికి చెందిన ఓనేత, మరో మద్యం వ్యాపారి, ఎమ్మెల్యే వెంట ఎప్పుడూ ఉండే మరో నాయకుడు జట్టుకట్టారు. మద్యం షాపుల దరఖాస్తు చేసుకోవాలనుకునే వారిని పసిగట్టి మరీ ఫోన్లు చేస్తున్నారు. మీరెవ్వరూ దరఖాస్తులు చేయరాదంటూ హుకుం ప్రదర్శిస్తున్నారు. కాదు, కూడదంటే అన్నతో మాట్లాడాలంటూ టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసుల రెడ్డి పేరును వాడుతుండడం గమనార్హం. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి నిరభ్యంతరంగా మద్యం షాపులకు దరఖాస్తులు చేసుకోవచ్చని స్టేట్‌మెంట్ ఇవ్వకపోవడం కూడా ఆ నలుగురి వాదనకు బలం చేకూరుతోంది.

పీలేరులో అదే పరిస్థితి..

అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గంలో 18మద్యం షాపులకు నోటిఫికేషన్ విడుదలైంది. మద్యం షాపులన్నీ తమ అనుచరులకే కావాలంటూ ఓ ప్రజాప్రతినిధి రంగప్రవేశం చేసినట్లు సమాచారం. మద్యం వ్యాపారంపై ఆసక్తి ఉన్న వారికి స్వయంగా ఫోన్లు చేస్తూ దరఖాస్తు చేయరాదంటూ హెచ్చరికలు చేస్తున్నట్లు సమాచారం. ఎప్పటి నుంచో ఉన్న అనుచరులకు వెసులుబాటు కల్పించాలి, మీరు పోటీకి రావద్దని కొందరికి నయంగా, మరి కొందర్ని బెదిరిస్తూ కట్టడి చేస్తున్నట్లు తెలుస్తోంది.

కమలాపురంలోనూ హెచ్చరికలు

కమలాపురం నియోజకవర్గంలో 13మద్యం షాపులకు టెండర్లు పిలిచారు. ఎవరూ దరఖాస్తులు చేయరాదంటూ అధికారపార్టీకి చెందిన ముఖ్యనేత హుకుం జారీ చేశారు. స్వయంగా కొందరు టీడీపీ నేతలే విన్నవిస్తున్నా మద్యం షాపుల జోలికి వెళ్లద్దంటూ హెచ్చరికలు చేసినట్లు సమాచారం. టీడీపీ విజయం కోసం పనిచేసినా నిరుపయోగమే అయ్యిందని వీరపునాయనిపల్లెకు చెందిన ఓ టీడీపీ కార్యకర్త తన సన్నిహితుల వద్ద ఈవిషయమై వాపోయినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం టీడీపీ కార్యకర్తల కోసమే మద్యం పాలసీ తీసుకొస్తే నాయకులే ఏకపక్షంగా దక్కించుకునే ఎత్తుగడలో ఉన్నారని, మద్యం షాపులన్నీ వారికే కావాలంటా, ఎవ్వరూ దరఖాస్తు చేయవద్దంటున్నారని ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం.

పారదర్శకంగా మద్యం టెండర్లు



మద్యం పాలసీ అత్యంత పారదర్శకంగా అమలు చేస్తాం. ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించే వెసులుబాటు కల్పించింది. 9వ తేది సాయంత్రం 5గంటల లోపు వచ్చే దరఖాస్తులన్నీ స్వీకరిస్తాం. దరఖాస్తుదారులు, కలెక్టర్ సమక్షంలో 11వతేది జెడ్పీ మీటింగ్ హాల్‌లో లాటరీ తీస్తాం. లాటరీ వ్యవహారమంతా వీడియో రికార్డింగ్ కూడా చేపట్టనున్నాం. అత్యంత పారదర్శకంగా టెండర్ ప్రక్రియ కొనసాగించనున్నాం. మద్యం వ్యాపారులు అనువైన ప్రాంతాలల్లో నిరభ్యంతరంగా దరఖాస్తులు చేసుకోవచ్చు.

- ఎక్సైజ్‌శాఖ డీసీ జయరాజు



నేడు ఉద్యోగ మేళా

రాయచోటి (జగదాంబసెంటర్) : అన్నమయ్య జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీలలో వివిధ హోదాలలో పనిచేయుటకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివి 18 నుండి 34 సంవత్సరాలలోపు గల అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికయిన అభ్యర్థులకు నెలకు రూ.10 వేల నుండి రూ.25 వేల వరకు హోదాను బట్టి వేతనం ఇస్తారన్నారు. విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలు, ఫోటోలతో ఉద్యోగమేళాకు హాజరుకావచ్చునని ఆయన తెలియజేశారు. ఆద్య హెచ్‌ఆర్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో జూనియర్ టెక్నీషియన్ ఉద్యోగానికి, ముత్తూట్ ఫైనాన్స్‌లో జూనియర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, ఇన్నోవ్ సోర్స్(ఎస్‌బీఐ కార్డ్స్) కంపెనీలో టెలీకాలర్స్, టీంలీడర్, బీఆర్‌ఈ (ఇన్‌సైడ్ బ్యాంక్), యంగ్ ఇండియా కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు మేళా నిర్వహిస్తారన్నారు.

గడువులోపు ఫిర్యాదుల పరిష్కారం

గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజలు సమర్పించే వినతులను పరిశీలించి గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ శివశంకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కలెక్టరేట్‌లో అర్జీలు సమర్పిస్తే తమ సమస్యలు పరిష్కారమవుతాయని సుదూర ప్రాంతాలనుంచి ఎన్నో ఆశలతో ప్రజలు వస్తున్నారన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కరించాలన్నారు. అంతకుముందు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరించారు.

- తన ఆధీనంలో ఉన్న పట్టా భూమికి ఒక సర్వే నెంబరు బదులు మరో సర్వే నెంబరు చూపుతున్నారని దువ్వూరుకు చెందిన నాగిరెడ్డి ఫిర్యాదు చేశారు.
- తన భూమిపై 1బీ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని రాజుపాలెం మండలం టంగుటూరుకు చెందిన డి.సుబ్బరాయుడు కోరారు.
- తనకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని సిద్ధవటం బీసీ కాలనీకి చెందిన ఎస్.వెంకట సుబ్బమ్మ, తనకు మరుగుదొడ్డి మంజూరు చేయాలని అదే మండల కేంద్రానికి చెందిన గాలి ఓబయ్య కోరారు.



ఫిర్యాదులను పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

ఈ కార్యక్రమంలో డీఆర్వో గంగాధర్‌గౌడ్, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మహిళపై టీడీపీ వర్గీయుల దాడి

- ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చినందుకు కక్ష
- కరెంట్ తీసి మరీ కత్తితో నరికిన వైనం
- తీవ్ర గాయాలకు లోనైన మహిళ
- కేసు నమోదు చేయని పోలీసులు

మదనపల్లె : ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు పలికినందుకు ఓ మహిళపై కత్తితో విచక్షణారహితంగా దాడిచేశారు. ఈ సంఘటన అన్నమయ్య జిల్లాలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితురాలు శ్రావణి భర్త హరి కథనం మేరకు వివరిలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలంలోని వలసపల్లె పంచాయతీ అరవవాండ్లపల్లెకు చెందిన హరి, శ్రావణి దంపతులు. వీరు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు. వీరికి రెండెకరాల డీకేటీ భూమికి సంబంధించి గ్రామంలోని టీడీపీ వర్గీయులైన తమ దాయాదులతో వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సమయంలో టీడీపీకి అనుకూలంగా పనిచేయాలని, లేకుంటే కూటమి ప్రభుత్వం ఏర్పడినాక ఇబ్బందులు తప్పవని వారు హెచ్చరించారు. అయినా హరి, శ్రావణి వారి మాట వినలేదు. ఈ క్రమంలో కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వారిని తరచూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఆదివారం రాత్రి టీడీపీ నాయకుల సూచనతో గంట పాటు గ్రామంలో కరెంటు లేకుండా చేశారు. ఇదే సమయంలో శ్రావణి పాలు పితికి ఇంటిలోకి తీసుకొస్తుండగా.. నిందితులు పూల పాపయ్య, నారాయణమ్మ, పెద్ద లక్ష్మి దాడికి పాల్పడ్డారు. దాడిలో కోడి కత్తి తో తీవ్రంగా గాయపరిచారు. ఘటనలో శ్రావణి ముఖం, వెనకవైపు మెడ భాగంలోను, శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్సలో భాగంగా 32 కుట్లు వేశారన్నారు. మెడ వెనక వైపున నరం తెగిపోవడంతో పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆసుపత్రికి తీసుకువెళ్లాలని స్థానిక వైద్యులు సూచించారు. ఘటనపై శ్రావణి తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసినా, నిందితులపై చర్యలు తీసుకోలేదు. కేసు నమోదు చేయలేదు. కాగా, . ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రావణిని సోమవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ మదనపల్లె నియోజకవర్గం సమన్వయకర్త నిసార్ అహ్మద్ పరామర్శించారు. వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ వర్గీయులు హత్యాయత్నానికి పాల్పడటంపై జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలని నిసార్ అహ్మద్ కోరారు. అలాగే టీడీపీ వర్గీయులు చేస్తున్న దాడులను అరికట్టి ప్రజలకు రక్షణ కల్పించాలన్నారు.



హత్యాయత్నానికి గురైన శ్రావణిని పరామర్శిస్తున్న నిసార్ అహ్మద్

ఉత్సవాల వేళ.. ఉట్టిపడుతున్న కళ



అమ్మవారి బంగారు రథం

ఆ ఆలయం ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకం.. నిలువెత్తు ఆలయ గోపురం పట్టణానికే తలమానికం.. అదే ప్రొద్దుటూరులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం. దసరా ఉత్సవాలకు రెండో మైసూరుగా ఖ్యాతిగాంచిన పసిడిపురి వెలిగిపోతోంది. జిల్లావ్యాప్తంగానే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి తరలివస్తున్న భక్తజనంతో కళకళలాడుతోంది. దసరా ఉత్సవాల నేపథ్యంలో 'అమ్మవారి వైభవం'పై ప్రత్యేక కథనం.

- వాసవీ మాతకు ఆధ్యాత్మిక వైభవం
- కన్యకాపరమేశ్వరికి వజ్రపుచీర, కిరీటం, బంగారు రథ సేవ..
- పట్టణానికే తలమానికంగా విరాజిల్లుతున్న అమ్మవారిశాల

ప్రొద్దుటూరు కల్చరల్ : దసరా అంటేనే గుర్తుకువచ్చేది ప్రొద్దుటూరు శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయం. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్నాటక ప్రాంతాల నుంచి కూడా భక్తులు ఇక్కడ నిర్వహించే దేవీనవరాత్రుల ఉత్సవాల్లో పాల్గొంటారు. మైసూరు తర్వాత దసరా వేడుకలకు ప్రొద్దుటూరు ఖ్యాతిగాంచింది. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో 134 ఏళ్లుగా ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సుందరంగా నిర్మించిన ఈ ఆలయ గోపురం పట్టణానికే చిహ్నంగా మారింది. ఈ ఆలయం ఆధ్యాత్మిక చింతనకు, ప్రశాంతతకు నిలయం. ఆర్యవైశ్యులతోపాటు అన్ని కులాలు, మతాల భక్తులు అమ్మవారిని దర్శించి పూజలు చేస్తుంటారు. ఆలయ గర్భగుడి లోపల గ్రానైట్, మార్బుల్ రాళ్లతో మనోహరంగా తీర్చిదిద్దారు. గర్భగుడికి వెండి తొడుగులను ఏర్పాటు చేశారు. అమ్మవారికి అద్దాల మండపం ఉంది. దీంతో ఎటు వైపు చూసిన అమ్మవారు దర్శనమిస్తారు.


రోజూ ప్రత్యేక పూజలు

వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారికి రోజూ విశేష అభిషేకాలు, అర్చనలతోపాటు లోక కల్యాణార్థం వాసవీ నిత్యహోమాన్ని చేస్తుంటారు. అమ్మవారికి ఏ ఆలయంలోలేని విధంగా పుత్తడి ఆభరణములు, పాశాంకుశాలు, వజ్రపు చీర, కిరీటం, బంగారు చీరెలలో విశేష పర్వదినాల్లో దర్శనమిస్తారు. ఇక అమ్మవారికి పాయసాన్ని బంగారు పాత్రలో నివేదిస్తారు. అలాగే స్వర్ణపాత్రలో అమ్మవారి పాదాల చెంత ఉంచిన బంగారు పాత్రలో ఉంచిన తీర్థాన్ని మరుసటి రోజు భక్తులకు తీర్థంగా పంపిణీ చేస్తారు. దీని వల్ల భక్తులకు రోగాలు నయమౌతాయని ప్రతీతి. మంగళవారం, శుక్రవారం సాయంత్రం స్వర్ణశ్రీచక్ర మేరువుకు పూజ నిర్వహిస్తున్నారు. వీటితోపాటు విశేషంగా ప్రతి సోమవారం సాయంత్రం గజవాహన సేవ, మంగళవారం సాయంత్రం సువర్ణ రజిత అష్టదళ పద్మపూజసేవ, బుధవారం వెండి ఊయలసేవ, గురువారం స్వర్ణరథ సేవ, శుక్రవారం పల్లకిసేవ, శనివారం వెండి సింహాసనసేవ, ఆదివారం ఉదయం గో క్షీరంతో అభిషేకం, సాయంత్రం స్వర్ణరథసేవ నిర్వహిస్తారు. ఇక విజయదశమి నాడు వాసవాంబ పంచలోహ రథంలో భక్తులను కరుణిస్తారు.



విద్యుత్ దీపాలంకరణలో అమ్మవారిశాల

అమ్మవారిశాల కీర్తిని విశ్వవ్యాపితం చేస్తాం



ప్రొద్దుటూరులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవి కీర్తిని విశ్వవ్యాప్తం చేస్తాం. గతంలో అమ్మవారికి నిత్యపూజా కార్యక్రమాలు జరిగేవి. 2004 తరువాత అమ్మవారికి విశేష పూజాకార్యక్రమాలతో పాటు నిత్య సేవలు ప్రారంభించాం. అమ్మవారికి బంగారు రథం సేవ, గజవాహన సేవ, వెండి ఊయలసేవ ఇలా రోజూ ఒక్కో సేవను నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం 134వ దసరా ఉత్సవాలను నిత్యనూతనంగా..వైభవంగా నిర్వహిస్తున్నాం. భక్తులు పాల్గొని అమ్మవారి అలంకారాలను దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలి.

- బుశెట్టి రాంమోహన్‌రావు, ఆర్యవైశ్యసభ సభ అధ్యక్షుడు, ప్రొద్దుటూరు

లోకమాత.. జగజ్జననీ..

లోకమాత జగజ్జననీ అంటూ భక్తులు అమ్మవారిని శరణు వేడారు. దేవీ శరన్నవరాత్రులలో 5వ రోజైన సోమవారం తోటోత్సవం నిర్వహించారు. వనాన్ని తలపించేలా ఆలయాలను మొక్కలతో తీర్చిదిద్దారు. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో సాయంత్రం శ్రీదేవి వనవిహారినిగా, రాత్రి బిల్వవృక్ష నివాసిని పార్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వనం మధ్య పార్వతీ పరమేశ్వరులు, వన్య ప్రాణులు, దేవతా మూర్తుల సెట్టింగ్ అందరిని ఆకట్టుకుంది. జిల్లాలోని అన్ని ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.

- ప్రొద్దుటూరు కల్చరల్





ఆలయంలో భక్తుల సందడి (ఇన్‌సెట్) అమ్మవారిశాలలో శ్రీదేవి వనవిహారిణి

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణం పాత మార్కెట్ సమీపంలోని మెయిన్ రోడ్డు వద్ద సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడు తెల్ల షర్టు, నీలి రంగు పంచె ధరించి ఉన్నాడు. ఇతని వివరాలు తెలిసిన వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

చౌక దుకాణాలపై కేసులు నమోదు



రేషన్ దుకాణంలో తనిఖీ చేస్తున్న లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ పి.జయదేవ్

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని చౌకదుకాణాలపై సోమవారం లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ పి.జయదేవ్ దాడులు నిర్వహించారు. ముద్రలు లేని కాటాలు కలిగిన చౌకదుకాణాలపై 8 కేసులు నమోదు చేశామని, రూ.20వేలు జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలకు సరఫరా చేస్తున్న రేషన్ తూకాలు చెక్ చేస్తున్నట్లు తెలిపారు. తూకాలలో మోసానికి పాల్పడితే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

వెల్లటూరు వైన్‌షాపులో చోరీ



వైన్‌షాపులో దుండగులు పైకప్పు కోసిన దృశ్యం

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి మండలం వెల్లటూరు గ్రామ సమీపంలోని ప్రభుత్వ వైన్‌షాపులో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. షాపులో ఉన్న రూ.5,09,000 నగదును దుండగులు అపహరించుపోయారు. పోలీసుల కథనం మేరకు.. ప్రభుత్వ వైన్‌షాపులో శనివారం, ఆదివారం రెండు రోజులకు వచ్చిన మొత్తం నగదు షాపులోనే ఉంది. సోమవారం ఉదయం 10 గంటలకు షాపునకు వచ్చేసరికి తలుపులు రావడంలేదు. తలుపులను బద్దలు కొట్టి లోపల చూడగా షాపునకు పైన ఉన్న రేకులకు రంధ్రం వేసి లోపలికి దిగి షాపులో ఉన్న నగదు దోచుకెళ్లారని షాపు సూపర్ వైజర్ పెండ్లిమర్రి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సంఘటన స్థలాన్ని ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, పోలీసులు పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సెంచరీల మోత మోగించిన కుర్రాళ్లు

డబుల్ సెంచరీ చేసిన రాజమోహన్



తలపడుతున్న విశాఖపట్నం, తూర్పుగోదావరి జట్లు



పరుగులు చేసిన ప్రకాశం బ్యాట్స్‌మన్ రాజ్‌మోహన్



107 పరుగులు చేసిన ప్రకాశం బ్యాట్స్‌మన్ హేమంత్ రాయల్



127 పరుగులు చేసిన తూర్పుగోదావరి బ్యాట్స్‌మన్ సాకేత్‌రెడ్డి



109 పరుగులు చేసిన తూర్పుగోదావరి బ్యాట్స్‌మన్ కార్తీక్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–14 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ పోటీల్లో కుర్రాళ్లు సెంచరీ మోత మోగించారు. వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో విశాఖపట్నం, తూర్పుగోదావరి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన తూర్పుగోదావరి జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 66.2 ఓవర్లలో 259 పరుగుల వద్ద తూర్పుగోదావరి జట్టు ఆలౌట్ అయింది. జట్టులోని జి. కార్తీక్ 109 పరుగులు, కె. కృష్ణసాకేత్‌రెడ్డి 129 పరుగులతో రాణించారు. విశాఖ బౌలర్లు మనోజ్‌నాయుడు 3, ప్రఖ్యాత్‌వర్మ 3 వికెట్లు తీశారు.

అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 23 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 112 పరుగులు చేసింది. జట్టులోని తమన్‌రెడ్డి 48, ముఖేష్‌కుమార్ 33 పరుగులు చేశారు. తూర్పుగోదావరి బౌలర్లు మనివర్దన్ 2 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

కేఎస్ఆర్ఎం మైదానంలో : కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు, పశ్చిమ గోదావరి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన పశ్చిమ గోదావరి జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 62 ఓవర్లలో 120 పరుగులకే పశ్చిమగోదావరి జట్టు ఆలౌట్ అయింది. జట్టులోని రిత్విక్‌రెడ్డి 41, సాయివల్లభన్ 24 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్లు తేజేష్ 5 వికెట్లు, మోహిత్‌సాయి 2, దినేష్ 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 37.5 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసింది. జట్టులోని శ్రీవంత్‌రెడ్డి 52, తనీశ్వర్ టెండూల్కర్ 27 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. దీంతో చిత్తూరు జట్టు 12 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

కేఓఆర్ఎం మైదానంలో : కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో ప్రకాశం, కడప జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ప్రకాశం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 90 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి ప్రకాశం జట్టు 405 పరుగులు చేసింది. జట్టులోని పి. రాజ్ మోహన్ 220 బంతుల్లో 33 ఫోర్లతో 208 పరుగులు చేశాడు. ఈయనకు జతగా హేమంత్‌రాయల్ 107 పరుగులు చేశాడు. కడప బౌలర్లు సాయికృష్ణ చైతన్య 3 వికెట్లు, అస్జద్‌ఖాన్ 2 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

ఆంధ్రా రంజీ జట్టుకు రఫీ

కడప క్రీడాకారునికి దక్కిన అవకాశం



ఎస్ఎండీ రఫీ

కడప స్పోర్ట్స్ : కడప నగరానికి చెందిన ఎస్. మహమ్మద్ రఫీకి ఆంధ్రా రంజీ జట్టుకు ప్రాతినిధ్యం వహించే అరుదైన అవకాశం లభించింది. సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు అనంతపురం జిల్లా ఆర్‌డీటీలో నిర్వహించిన ఆంధ్రా రంజీ క్యాంపు అనంతరం రంజీ పోటీల్లో పాల్గొనే ఆంధ్రా జట్టును ప్రకటించగా అందులో రఫీ అవకాశం దక్కించుకున్నాడు. రైట్ ఆర్మ్ ఫాస్ట్‌బౌలర్‌గా రాణించడంతో పాటు బ్యాటింగ్‌తో సైతం సత్తా చాటగల ఆల్‌రౌండర్ కావడంతో సెలెక్టర్‌లు ఆంధ్రా జట్టుకు ఈయనను ఎంపిక చేశారు. కడప నగరానికి చెందిన సిరాజుద్దీన్ దౌలా (ఆర్ఎస్ఐ), ఫాతిమున్నీసా దంపతుల కుమారుడైన రఫీ.. అండర్–12 నుంచి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చాడు. అండర్–14, అండర్–16, అండర్–19, అండర్–23, సీనియర్స్ ఇలా అన్ని విభాగాల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. కాగా గతంలో సైతం రంజీ పోటీల్లో ఆంధ్రా జట్టుకు ప్రాతినిధ్యం వహించి 14 వికెట్లు తీశాడు. కేరళ, గుజరాత్, సౌరాష్ట్ర జట్లతో నిర్వహించిన రంజీ పోటీల్లో ఆంధ్రా తరఫున పాల్గొన్నాడు. అండర్–23 విభాగంలో పంజాబ్ జట్టుపై సెంచరీ సాధించి అటు బ్యాటింగ్‌లోను రాణించాడు. చిన్నప్పటి నుంచి తండ్రి సిరాజుద్దీన్ దౌలా మార్గదర్శనం, శిక్షణలో రాటుదేలిన ఈయన కడప అకాడమీలో చేరిన తర్వాత హెచ్ కోచ్ మధుసూదన్‌రెడ్డి శిక్షణలో మరింత మెలకువలు నేర్చుకుని ఆంధ్రా రంజీ క్రీడాకారునిగా రాణిస్తున్నాడు. కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో బీబీఎం ఫైనలియర్ చదువుతున్న ఈ క్రీడాకారుడు రానున్న రోజుల్లో భారతజట్టుకు ప్రాతినిధ్యం వహించడమే తన లక్ష్యమని పేర్కొన్నాడు. కాగా కడప క్రీడాకారుడు రంజీ జట్టుకు ఎంపిక కావడం పట్ల క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి, కార్యదర్శి ఎ. రెడ్డిప్రసాద్, అసోసియేషన్ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

దాడులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రాన్ని చూపుతున్న కమలాపురం మండలం పొడదుర్తి గ్రామస్తులు

కడప సెవెన్‌రోడ్స్ : కమలాపురం మండలం పొడదుర్తి గ్రామ పొలం సర్వే నంబరు 101/2లో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి అడ్డుచెప్పిన వారిపై దాడులకు పాల్పడుతున్న మొయిళ్ల వెంకట సుబ్బారెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు సోమవారం కలెక్టర్ శివశంకర్ లోతేటికి ఫిర్యాదు చేశారు. సదరు సర్వే నంబరులో 15.90 ఎకరాల భూమి ప్రభుత్వ రికార్డుల మేరకు గ్రామ కంఠంగా ఉందని పేర్కొన్నారు. అయితే తమ గ్రామానికి చెందిన వెంకట సుబ్బారెడ్డి ఆ సర్వే నంబరులో సుమారు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి చుట్టూ కంచె వేశారని తెలిపారు. తమ దళితులకు సంబంధించిన సుమారు 50 సమాధులను తవ్వేశారని చెప్పారు. అలా చేయడం వల్ల వంక నీరు మొత్తం ఊరి మీదకు వస్తోందన్నారు. దీంతో తాము ఆయనను ప్రశ్నించగా కావాలంటే పది సెంట్ల స్థలం పక్కన ఇస్తానంటున్నారని చెప్పారు. అందుకు తాను అంగీకరించకపోవడంతో తమను కులం పేరుతో తీవ్ర పదజాలంతో దూషించారని ఆరోపించారు. ఈ విషయాన్ని తాము తహసీల్దార్ దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ప్రభుత్వ భూమికి బోర్డు ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించామన్నారు. అయితే చర్యలు తీసుకోవాల్సిన తహసీల్దార్ సర్దుకుపోవాలని ఉచిత సలహాలు ఇస్తున్నారని తెలిపారు. కనుక ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అలిదెన నరసింహారెడ్డి, ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు వేధిస్తున్నారని ఎస్పీకి ఫిర్యాదు

కడప అర్బన్ : విచారణ పేరుతో తన తండ్రి గంజికుంట రఘురామిరెడ్డిని కడప టూటౌన్ పోలీసులు వేధిస్తున్నారంటూ అతని కుమారుడు గంజికుంట సురేష్‌కుమార్‌రెడ్డి జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజుకు ఫిర్యాదు చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం జిల్లా ఎస్పీని కలిసిన బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా వున్నాయి. శంకరాపురంలో నివాసం ఉంటున్న తన తండ్రి రఘురామిరెడ్డి కిరాణా షాపును నిర్వహిస్తున్నాడన్నారు. గతంలో తినుబండారాలు సరఫరా చేస్తున్న హరి అనే వ్యక్తి తన తండ్రి వద్దకు వచ్చి 90 కిలోల వక్కలు ఉన్నాయంటూ అమ్మాడు. తమకు వ్యాపారం జరగకపోవడంతో తెలిసిన వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకున్నామన్నారు. అయితే కడప టూటౌన్ పోలీసులు వక్కలను అమ్మిన వ్యక్తిని వదిలేసి వక్కలను కొన్న తమను డబ్బులు చెల్లించాలంటూ వేధిస్తున్నారన్నారు. హరి అనే వ్యక్తి వక్కలను ఎక్కడో దొంగతనం చేసి తక్కువ ధరకు తన తండ్రికి విక్రయించాడన్నారు. ఆ విషయం తమకు తెలియదన్నారు. తమకు వక్కలను విక్రయించిన హరి అనే వ్యక్తిని పోలీసులు విచారించాలని, తన తండ్రిని విచారణ పేరుతో వేధించవద్దని ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య



మృతి చెందిన పుల్లారెడ్డి

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి మండలం వెల్లటూరు రాజీవ్ నగర్ గ్రామానికి చెందిన పార్ల పుల్లారెడ్డి(57) అనే రైతు సోమవారం అప్పుల బాధ తాళలేక విషపు ద్రాణం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. పుల్లారెడ్డి అప్పులు ఎక్కువ కావడంతో మనస్థాపానికి గురై ఇంట్లో పురుగుల మందుల తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన కడప ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతునికి 3 ఎకరాల పొలం ఉంది. బోర్లకు, పంటల సాగుకు, కుమార్తె పెళ్లికి దాదాపు రూ.20లక్షల పైగా అప్పులు అయ్యాయి. అప్పుల బాధతో విష ద్రావణం తాగాడు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

'మా భూములు పోకుండా న్యాయం చేయాలి'



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దళితులు

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామ పంచాయతీ ఎస్‌కేఆర్ నగర్ గ్రామానికి చెందిన దళితులు తమ భూములు పోకుండా న్యాయం చేయాలని సోమవారం తహసీల్దార్ మురాషావలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత కుటుంబాలకు సర్వే నంబర్ 937లో అసైన్‌మెంటు కమిటీలో 75 ఎకరాలు డీకేటీ భూమిని కేటాయించారన్నారు. రెవెన్యూ, అటవీ శాఖలకు సంబంధించి భూముల సర్వేలలో తమ భూములు అటవీశాఖకు పోకుండా న్యాయం చేయాలన్నారు. భూములను సాగు చేసుకోమని అధికారులు నిర్ణయించినా కొంత మంది తరచూ తమ భూములు తమకు చెందకుండా అడ్డు పడుతున్నారన్నారు. తాము ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లి జీవనోపాధి పొందుతున్నామన్నారు. పెద్దలు సంపాదించిన ఆస్తులు కూడా ఏమీ లేవని తమకు డీకేటీ భూములను మంజూరు చేసి న్యాయం చేయాలని తహసీల్దారును కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ మీ భూములు మీకు వచ్చే విధంగా పై అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చలపాటి చంద్ర, గంజి సుబ్బరాయుడు, మాజీ సర్పంచ్ గాలి ఓబులయ్య, దళిత కుటుంబాల వారు పాల్గొన్నారు.

ఖైదీల ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలి



కడప పురుషుల కేంద్ర కారాగారంలో ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్

కడప అర్బన్ : ఖైదీల ఆరోగ్య విషయాలపట్ల ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు వహించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ పేర్కొన్నారు. సోమవారం కడప కేంద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మానసిక వ్యాధిగ్రస్తులైన ఖైదీల ఆరోగ్య విషయాల పట్ల ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మందులను సక్రమంగా వాడాలన్నారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికారసంస్థ, కడప వారిని సంప్రదించవచ్చన్నారు. ప్రత్యేక మహిళా కారాగారంలో మహిళా ఖైదీలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్‌లు జవహర్‌బాబు, రమేష్‌బాబు, వైద్యాధికారి వినయ్‌బాబు, ప్రత్యేక మహిళా కారాగారం సూపరింటెండెంట్ కృష్ణవేణి, డిప్యూటీ జైలర్, మహిళా పారాలీగల్ వలంటీర్‌లు, మహిళా ఖైదీలు, సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలులో బాబు బౌల్డ్ అయ్యారు

ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఇచ్చిన వాటిని అమలు చేయలేక ఎన్‌డీఏ కూటమి క్లీన్‌బౌల్డ్ అయిపోయింది. ఇక సిక్స్ కొట్టడానికి బ్యాట్ కూడా లేవని పరిస్థితి ఉంది. అలాంటప్పుడు సిక్స్ ఎలా కొడతావు అంటూ జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డిని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ప్రశ్నించారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అమలు కోసం తాను సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన తర్వాత అసెంబ్లీలో సూపర్ సిక్స్ అమలు చేయాలంటే భయమేస్తోందంటూ చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చి 100 రోజులు దాటింది. ఇప్పటి వరకు సూపర్ సిక్స్‌లో ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సైతం గండికోట ముంపువాసులకు 12 లక్షల రూపాయలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారని, వారికి ఇంకా 3.25 లక్షల రూపాయలు రావాల్సి ఉందన్నారు. దాని గురించి ముంపువాసులు అడిగితే దాటవేస్తున్నారని చెప్పారు. అలాగే రాజోలి ముంపు వాసులకు ఎకరాకు 24 లక్షల రూపాయలు ఇప్పిస్తామన్నా, ఇంత వరకు దాని ఊసేలేదన్నారు. మెగా వైద్య శిబిరాలు పెట్టడం మంచిదే కానీ, దాంతోపాటు ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు సక్రమంగా విధులు నిర్వహించేలా చూడాలన్నారు.

రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి సూపర్ సిక్స్ అమలులో పూర్తిగా విఫలం కావడంతో ప్రజలు మరోసారి సూపర్ నైన్ (నవరత్నాలు) పథకాలు అమలు కావాలని కోరుకుంటున్నారని రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలైన నవరత్నాలను అమలు చేసిన ఘనత దేశంలో ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో గిరిధర్‌రెడ్డి, రామాంజనేయుల యాదవ్, కొమ్మెర్ల మోహన్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఆపాలి



మాట్లాడుతున్న మగ్బూల్ బాషా

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పాలస్తీనా ప్రజలపై దారుణ మారణహోమానికి పాల్పడుతున్న ఇజ్రాయిల్ తన దాడులను వెంటనే ఆపాలని ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాషా డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాఠశాలలు, ఆసుపత్రులు, మసీదుల పైనా ఇజ్రాయిల్ బలగాలు దాడులకు పాల్పడటం దారుణమన్నారు.

పేదల కష్టార్జితం.. గాడిద పాలు

జెన్నీ మిల్క్ నిర్వాహకుల అరెస్టు



మహ్మద్ గౌస్ నూతలపాటి మురళి ఉమాశంకర్‌రెడ్డి

హొసపేటె : గాడిదలు మా వద్దనే కొనండి, ఆ పాలను మాకు అమ్మండి, ఎంతో ఆదాయం పొందండి అని ప్రజలను వంచించిన కేసులో ఎట్టకేలకు నిందితులు చిక్కారు. జెన్ని మిల్క్ కంపెనీకి చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ హరిబాబు తెలిపారు. సోమవారం సాయంత్రం కర్ణాటక రాష్ట్రం హొసపేటె టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏపీలోని నెల్లూరుకు చెందిన జెన్ని మిల్క్ కంపెనీ ఎండీ నూతలపాటి మురళి (43), కడపకు చెందిన మేనేజర్లు ఉమాశంకర్ రెడ్డి (33), సయ్యద్ మహ్మద్‌గౌస్ (27)లను అరెస్ట్ చేశామని తెలిపారు. కంపెనీకి చెందిన 5 బ్యాంకు ఖాతాల నుంచి నగదును స్వాధీనం చేసుకుని ఫ్రీజ్ చేసినట్లు చెప్పారు. జిల్లాలోని రైతులు భయాందోళన చెందవద్దని, ఓపికగా ఉంటే మేలు జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

ఏమిటీ కుంభకోణం?

కర్ణాటకలో హొసపేటె నగరంలో జెన్ని మిల్క్ కంపెనీ కార్యాలయం గత మే నుంచి ప్రారంభమైంది. ఇక్కడి నుంచి రాష్ట్రమంతటా వ్యాపారం విస్తరించాలని పథకం వేశారు. ప్రస్తుతం గాడిద పాలకు చాలా డిమాండు ఉందని ప్రచారం సాగించారు. తమతో చేరాలని కోరారు. ఇలా ఒక్కో వ్యక్తి నుంచి రూ. 3 లక్షలు తీసుకుని, వారికి రెండు గాడిదలను ఇచ్చారు. పాలు తమకే ఇస్తే కొంటామని చెప్పారు. ఎంతోమంది రూ. 3 లక్షలు కట్టి గాడిదలను తీసుకున్నారు. అలా కోట్లాది రూపాయలను వసూలు చేసి బోర్డు తిప్పేశారని బాధితులు ఫిర్యాదు చేశారు. ఏఎస్పీ సలీంపాషా, డీవైఎస్పీ మంజునాథ్ తల్వార్ గాలించి నిందితులను అరెస్టు చేశారు.

రెండు టపాసుల గోడౌన్లు సీజ్

ప్రొద్దుటూరు : స్థానిక పాట్టిపాడు రోడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన రెండు టపాసుల గోడౌన్లను రూరల్ పోలీసులు సీజ్ చేశారు. తమిళనాడు రాష్ట్రం నుంచి అక్రమంగా భారీ ఎత్తున టపాసుల దిగుమతి చేసుకుని నిల్వ ఉంచినట్లు సమాచారం రావడంతో పోలీసులు తనిఖీలు చేశారు. గోడౌన్లలో పెద్ద ఎత్తున టపాసులు ఉన్నట్లు గుర్తించారు. ఒక గోడౌన్‌లో రూ.2.86 లక్షలు, మరో గోడౌన్‌లో రూ.2.96 లక్షల సరుకును సీజ్ చేశారు. పట్టణానికి చెందిన వేణు, సత్యనారాయణ అనే వ్యక్తులపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో వేర్వేరుగా కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధి కోసం వస్తే.. ఊపిరి ఆగింది

కుటుంబ పోషణ కోసం దినసరి కూలీలుగా మారి అలుపెరగని పోరాటం చేస్తున్న ఆ అభాగ్యులను పిడుగుపాటు రూపంలో మృత్యువు లాక్కెళ్లింది. మరో ఏడుగురు అపస్మారక స్థితిలో ఉన్నారు. ఈ విషాద సంఘటన సంబేపల్లె మండలం ఎస్.సోమవరం గ్రామంలో చోటు చేసుకుంది. కూలీల స్వగ్రామమైన శెట్టిపల్లెలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

- పిడుగుపాటుకు తోడికోడళ్లు మృతి
- అపస్మారక స్థితిలో మరో తొమ్మిది మంది
- విషాదంలో శెట్టిపల్లె దిగువ దళితవాడ



శంకరమ్మ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు



పిడుగుపాటుకు మృతి చెందిన మల్లీశ్వరి









రాయిచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూలీలు

సంబేపల్లె : మండల పరిధిలోని ఎస్.సోమవరం గ్రామ సమీప పొలాల్లో సోమవారం ఉరుములతో కూడిన వర్షానికి పిడుగు పడింది. దీంతో శెట్టిపల్లె శంకరమ్మ(43), శెట్టిపల్లె మల్లీశ్వరి (40) అనే మహిళా కూలీలు మృతి చెందారు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు శెట్టిపల్లె గ్రామం దిగువ హరిజనవాడకు చెందిన కూలీలు నిత్యం పనులకు వెళుతుండేవారు. ఈ క్రమంలో సోమవారం ఎస్.సోమవరం గ్రామంలో బావులకాడపల్లెకు చెందిన సిద్దయ్య పొలంలో టమాటా కాయలు కోసేందుకు వెళ్లారు. పొలంలో కాయలను గ్రేడింగ్ చేస్తుండగా ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పిడుగు పడటంతో శంకరమ్మ, మల్లీశ్వరి అక్కడికక్కడే మృతి చెందారు. వీరిద్దరూ తోడికోడళ్లు కావడం గమనార్హం. వీరితో పాటు పని చేస్తున్న తోటి కూలీలు యశోదమ్మ, కార్తీక్, జయమ్మ, రమణమ్మ, అలివేలమ్మ, సరస్వతి, రెడ్డెమ్మ, అమర్‌నాథ్, నాగమునెమ్మలు పిడుగుపాటుకు అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వెంటనే 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ, ఎంపీడీఓ రామచంద్ర, రెవెన్యూ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విషాదంలో హరిజనవాడ

రెక్కాడితే గానీ డొక్కాడని కూలీల కుటుంబాలను పిడుగుపాటు విషాదంలోకి నెట్టింది. వారందరూ ఒకే గ్రామస్తులు. అందులోను బంధువులు. మధ్యాహ్నం వరకు అందరితో కలిసి పని చేస్తున్న వారు ఒక్కసారిగా విగత జీవులు కావడంతో మిగిన వారు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న దృశ్యం అక్కడున్న వారిని కలచివేసింది. మృతులిద్దరూ తోడికోడళ్లు కావడం మరింత విషాదకరం.

రూ.5 లక్షల పరిహారం ప్రకటించిన సీఎం

రాయచోటి : పిడుగుపాటుకు గురై మృతిచెందిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిహారం ప్రకటించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలో పొలం పనులు చేసుకుంటూ పిడుగుపడి చనిపోయిన శంకరమ్మ, మల్లీశ్వరి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థికసాయం ప్రకటించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యాధికారులను సీఎం ఆదేశించారు.

పిడుగుపాటుపై రమేష్‌రెడ్డి దిగ్భ్రాంతి

రాయచోటి (జగదాంబసెంటర్) : సంబేపల్లె మండలం ఎస్.సోమవరం గ్రామం బావులకాడపల్లెలో సోమవారం పిడుగు పాటుకు ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందిన సంఘటనపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రభుత్వం వీరి కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు.

రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : సంబేపల్లె మండలం ఎస్.సోమవరం గ్రామంలో పిడుగుపాటుకు గురై మృతి చెందిన శంకరమ్మ, మల్లీశ్వరి కుటుంబాలకు ప్రభుత్వం రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. శెట్టిపల్లె దిగువ హరిజనవాడకు చెందిన ఇద్దరు వ్యవసాయ కూలీలు మృతి చెందడం పట్ల శ్రీకాంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. ఈ సంఘటనలో గాయపడిన వారికి ప్రభుత్వం మెరుగైన చికిత్స అందించాలని కోరారు. పిడుగు పడిన ప్రాంతాన్ని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు సందర్శించారు.